క్లుప్తంగా

జాబ్‌మేళా

పాలకొండ: జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉపాధి పొందాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానికంగా మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్‌మేళాతో యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. 245 మంది నిరుద్యోగులు హాజరు కాగా 83 మంది పలు కంపెనీలకు అర్హత సాధించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్లాప్‌మిత్ర, గ్రీన్‌గార్డులకు శిక్షణ

సీతంపేట: ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణపై పాలకొండ మండల క్లాప్‌మిత్ర, గ్రీన్‌గార్డులకు మంగళవారం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద శిక్షణ ఇచ్చారు. చెత్తను ఏ విధంగా సేకరించాలి, వేరు చేసే విధానం, వర్మీ కంపోస్టు తయారు చేసే పద్ధతుల గూర్చి రిసోర్సుపర్సన్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాంప్రసాద్, ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, పాలకొండ మండల గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

దంతాలను సంరక్షించుకోవాలి



దంత సంరక్షణ గూర్చి వివరిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: దంతాలను ప్రతీ ఒక్కరూ సంరక్షించుకోవాలని దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భానుప్రతాప్, దంత వైద్యాధికారి రేణుక అన్నారు. వరల్డ్ ఓరల్ హెల్త్‌డేను పురస్కరించుకుని దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంతాలను ఎలా కాపాడుకోవాలి, సంరక్షణ చర్యలు గూర్చి వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు.

రాయికురిడి గ్రామస్తుల ఆందోళన

సీతంపేట: తమ గ్రామంలో చర్చి నిర్మించవద్దంటూ స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద రాయికురిడి గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. గ్రామంలో 37 కుటుంబాలు నివసిస్తున్నామని, పూర్వీకుల నుంచి గిరిజన ఆచార సంప్రదాయలు కాపాడుకుంటూ ఎంతో కలిసిమెలిసి ఉంటున్నామన్నారు. ఎటువంటి పీసా చట్టం అనుమతులు లేకుండా చర్చి నిర్మించడం తగదన్నారు. ఈ మేరకు తహసీల్దార్ అప్పలరాజుకు ఫిర్యాదు చేశారు. షెడ్యూల్డ్ ఏరియా కాబట్టి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి నాయకులు గవరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మజ్జిగౌరమ్మ ఉత్సవాలు



బిల్లుమడలో మజ్జి గౌరమ్మ తల్లి మూలవిరాట్

భామిని: మండలంలోని బిల్లుమడలో వెలసిన శ్రీమజ్జిగౌరమ్మ తల్లి ఉత్సావాలు బుధవారం నుంచి జరగనున్నాయి. ఈ నెల 30 ఉగాది వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

చెడు అలవాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు..

భామిని: చెడు అలవాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ప్రజలకు సూచించారు. మండలంలోని సవరపాడులో నవోదయం 2.0లో భాగంగా గ్రామస్తులకు మంగళవారం అవగాహన కల్పించారు. సారాతో కలిగే అనర్థాలను వివరించారు. సవరపాడును సారా రహిత గ్రామంగా మార్చేందుకు గిరిజనుల సహకారం అవసరమని ఆ శాఖ సూపరింటెండెంట్ ఏఎస్ దొర అన్నారు. గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ దత్తత అధికారి పి.మురళీధర్, సీఐ, సర్పంచ్ బిడ్డికి మార్తమ్మ, బిడ్డిక అనంత్, సచివాలయ ఉద్యోగి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర మహోత్సవం



తిరువీధిలో పాల్గొన్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఉమా సహిత కైలాసనాథస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పంచమరాత్రి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాల తిరువీధి చేపట్టారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కూడా జాతరకు విచ్చేసి, స్వామి వారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

పాలకొండ సొగసు చూడతరమా...



కోమటిపేట వీధి పరిస్థితి



బాసూరు వారి వీధి వద్ద మురుగు కాలువ పరిస్థితి

డివిజన్ కేంద్రం పాలకొండ ఎక్కడికక్కడ చెత్త కుప్పలతో మురికి కూపంలా దర్శనమిస్తోంది. మరోవైపు చిన్నపాటి వర్షం పడితే చాలు... వీధుల్లో నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త కుప్పలపై పశువులు, పందులు చేరి మరింత చెత్త చేస్తున్నాయి. మరోవైపు కుళాయిల ద్వారా మురుగు నీరు పట్టణ ప్రజలను అవస్థల పాల్జేస్తోంది. ఇలా.. ఎటు చూసినా పాలకొండ నగర పంచాయతీ మురికి కూపంలా తయారైంది.

– పాలకొండ

రజకులపై దాడులను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

పాలకొండ: రజకులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని అఖిల భారత రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొగ్గ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్ఎల్‌పురం గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎల్ఎల్‌పురం గ్రామంలో రజక కులానికి చెందిన రేజేటి శేఖర్‌ను విద్యుత్ స్తంభానికి కట్టి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితునికి అండగా తమ సంఘం పోరాడుతుందని వివరించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. సంఘటన జరిగి వారం రోజులు కావస్తున్నా.. పోలీసులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు వీరస్వామి, చల్లా సాయి, శంకర్, కొమరపురి, గోవింద, చిలకలపిల్లి రాము, నాగరాజు, త్రినాధ, సింహచలం, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సభ్యులకు అభినందనలు



ఎన్‌సీసీ బృందాన్ని అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్, పీఈటీ

భామిని: భామిని ఏపీ మోడల్ స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, పీఈటీ శివరామప్రసాద్ మంగళవారం అభినందించారు. 2023 – 24 సంవత్సరానికిగాను 52 మందితో జూనియర్ డివిజన్ ఆర్మీ ఎన్‌సీసీ బృందం నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 2న శ్రీకాకుళంలో నిర్వహించిన ఎ సర్టిఫికెట్ పరీక్షల్లో పాల్గొన్న 52 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో వీరిని అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని మారోజు పద్మావతి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరామర్శించారు. ఇటీవల పద్మావతి అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు, నల్లి శివప్రసాద్, పార్టీ నాయకులు ఉన్నారు.

నవోదయకు పలువురి విద్యార్థుల ఎంపిక



పి.హేమాగ్ని



బి.కార్తికేయ



పి.మనోజ్



బి.శశాంక్



ఆర్.దేనిష్ నాయుడు

సీతంపేట:

మండలంలోని సరస్వతి విద్యా మందిర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాలకు చెందిన పాలక హేమగ్ని, బిడ్డిక కార్తికేయ, పాలక మనోజ్, శశాంక్‌లు ఎంపికయ్యారు. వీరిని ఎంఈఓ ఆనందరావు అభినందించారు.



జి.సాయి శాన్విత



ఆరాధ్య

వీరఘట్టంలో..

వీరఘట్టం: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశం కోసం జరిగిన పరీక్షలో వీరఘట్టం ప్రగతి హైస్కూల్‌కు చెందిన బెజ్జిపురం ఆరాధ్య సత్తా చాటింది. సోమవారం విడుదలైన ఫలితాల్లో ఆరాధ్య నవోదయలో సీటు సాధించినట్లు హైస్కూల్ ప్రిన్సిపాల్ శంభాన శ్రీనివాసరావు తెలిపారు. ఆరాధ్యకు అభినందనలు తెలిపారు.

నవోదయకు ఇద్దరి ఎంపిక

పార్వతీపురం: జవహర్ నవోదయకు గరుగుబిల్లి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. మండలంలోని ఉల్లిభద్రలో గల కవిరాయిని పాఠశాలలో చదువుతున్న ఆర్.డేనిష్ నాయుడు, మార్కొండపుట్టి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న జె.సాయి శాన్వితలు ఎంపికయ్యారు. వారిద్దరు ఆయాపాఠశాలల్లో చదువుతూ పార్వతీపురం పట్టణంలోని రిమిస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. వారిద్దరు నవోదయకు ఎంపిక కావడంపట్ల ఉపాధ్యాయులు, కోచింగ్ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద ఉన్న తిరుమల సాయి హైస్కూల్‌కు చెందిన 8 మంది విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ రౌతు సరళకుమారి మంగళవారం తెలిపారు. ఎంపికైనా వారిలో కొండగొర్రి షర్మిల, పాట్నూరు చైత్ర, కర్రి జాహ్నవి, గుల్ల కుందన శ్రీచరణి, కొండగొర్రి వేదాంత్, మండంగి కార్తికేయ, ఎర్ర తులసీధర్, గుంట్రెడ్డి మహీధర్ ఉన్నారు.

రెయిన్ ఫారెస్ట్ సర్టిఫికెట్‌తో ప్రయోజనం



అవగాహన కల్పిస్తున్న రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ సర్టిఫికేషన్ ప్రాజెక్టు మేనేజర్ నీల్‌కాంత్

గుమ్మలక్ష్మీపురం: రెయిన్ ఫారెస్ట్ సర్టిఫికెట్‌తో జీడిమామిడి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ సర్టిఫికేషన్ ప్రాజెక్టు మేనేజర్ నీల్‌కాంత్ తెలిపారు. మండలంలోని బుడ్డెమ్మఖర్జ గ్రామంలో ఆదితల్లి ఉత్పత్తిదారుల కంపెనీ సభ్యులతో మంగళవారం సమావేశమైన ఆయన.. రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ గత 38 ఏళ్లుగా కాఫీ, టీ, అరటి, కోకో, పామాయిల్, సుగంధ ద్రవ్యాలు తదితర పంటలకు సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతోందని, తద్వారా 70కి పైగా దేశాల్లో రైతులు తాము పండించిన పంటలను అదనపు ధరకు విక్రయిస్తూ ఆర్థికంగా లాభపడుతున్నారన్నారు. అంతేకాకుండా ఇక్కడి పంటలను ఇతర దేశాలకు ఎగుమతులు చేసుకునేందుకు తాము ఇచ్చే సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. ఆదితల్లి ఉత్పత్తిదారుల కంపెనీలోని 563 మంది రైతులు పండించే జీడిమామిడి ఇతర పంటలకు సర్టిఫికేషన్ చేయడానికి జట్టు సంస్థ సహకారంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రసాయన ఎరువులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులు వినియోగించి గానీ ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో గానీ పండించిన పంటలకు మాత్రమే తాము సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో సబల్ ప్రాజెక్ట్ రాష్ట్ర అధికారి పి.వినూత్న, సభ్యులు నేహా, శ్రీధర్, రోజాచంద్, ఏపీ సీఎన్ఎఫ్ మండల టీమ్ లీడర్ గణేష్ శరత్‌చంద్ర, జీవ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జి.ప్రబోధ్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజనులకు సంబంధించి, స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. అమరావతిలో కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమావేశమై ఏప్రిల్ మొదటి వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. మెగా డీఎస్సీ ప్రకటించినప్పుడే గిరిజనుల స్పెషల్ డీఎస్సీ కూడా ప్రకటించాలని కోరారు. ఎన్నికలకు ముందు జీవో నంబరు 3ను పునరుద్ధరించి గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయ ఖాళీలను గిరిజనులతోనే భర్తీ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

దారిమల్లి జీపీఎస్ సందర్శన



విద్యార్థుల చదువులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ

సీతంపేట: మండలంలోని దారిమల్లి గిరిజన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలను డిప్యూటీ ఈఓ ప్రసన్నకుమార్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వివిధ సబ్జెక్టుల్లో ఎలా చదువుతున్నారో పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం–2 కార్యకర్త పి.భవాని మృతి చెందారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, సోమవారం సాయంత్రం మరణించారు. మంగళవారం శివ్వాంలోని ఆమె స్వగృహానికి మృతదేహం తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి, సిబ్బంది అంతా భవాని మృతదేహంపై పూలమాలలు ఉంచి, నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాల నిమిత్తం రూ.15 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆర్.లక్ష్మి, ఎస్.గౌరమ్మ, యూనియన్ నాయకులు సీహెచ్ గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

కొమరాడ: యువత, విద్యార్థులంతా గంజాయి, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.నీలకంఠం సూచించారు. మండలంలోని గిరిశిఖర గ్రామాలైన గుజ్జబడి, బెడ్డ, పూసనంది తదితర గ్రామాల్లోని ప్రజలకు మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనమవుతుందని, ప్రస్తుతం చాలామంది ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లు బారినపడుతున్నారన్నారు. మైనర్ బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

ముగిసిన సోరా ఆర్ట్ వర్క్‌షాప్



సోరా ఆర్ట్ నేర్చుకుంటున్న యువత

సీతంపేట: స్థానిక పాత పీఎంఆర్‌సీ భవనంలో హ్యాండీక్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న సోరా ఆర్ట్ వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. దాదాపు 30 మంది యువతీ, యువకులు ఈ శిక్షణలో పాల్గొని వివిధ చిత్రాలను నేర్చుకున్నారు. డిజైనర్ ఓంకార్, అనిల్, గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఆలయ వార్షికోత్సవం



భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ కోటదుర్గ తల్లి

వీరఘట్టం: స్థానిక శ్రీకోటదుర్గ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పరిషత్ కృచ్ఛ్రత్రయం, పంచగవ్వ ఆరాధన, అఖండ దీపారాధన, ఋత్విక్ వరుణప్రధానం, యాగశాల ప్రవేశ ద్వారపూజ, ధ్వజ పతాకావిష్కరణ, మండల మండపారాధనతో ప్రత్యేక పూజలు చేశారు.

ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు అమ్మవారి నిజరూప దర్శనాన్ని భక్తులు తిలకించారు. నిజరూపంలో ఉన్న దుర్గాదేవికి భక్తులు నారికేళాభిషేకాలు చేశారు. అనంతరం దుర్గాదేవి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో దుర్గాదేవిని దర్శించుకున్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి



రైతులకు సూచనలిస్తున్న సైంటిస్టు లక్ష్మీనారాయణ

సీతంపేట: చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహించాలని స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని సంకిలి గ్రామంలో కొర్రలు, రాగులు కోతలు మంగళవారం జరిగాయి. పంటలను పరిశీలించిన ఆయన పలు సూచనలిచ్చారు. చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. అంతకు ముందు గోరపాడులో వాతావరణ మార్పులు విపత్తులు ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు అసోషియేషన్ కో ఆర్డినేటర్లు కృష్ణారావు, సురేష్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పరిశీలన



సీతంపేట మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఎంఈఓలు ఎం.ఆనందరావు, సూర్యచంద్రరావు మంగళవారం పరిశీలించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కొందరు విద్యార్థులు మెరుగైన నైపుణ్యం ప్రదర్శించడంతో అభినందించారు. గణితంలో ఆటలు ఆడించారు. అనంతరం మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించారు. వారితో హెచ్ఎం ఎస్.ప్రసాద్, సహోపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు, ఐఈడీ టీచర్ శ్రీకాంత్ ఉన్నారు.

– సీతంపేట

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీతంపేట మండలంలోని సామరెల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. చదువుతోనే పేదరికాన్ని రూపుమాపవచ్చన్నారు. టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. ఆయనతో హెచ్ఎం ఆరిక భాస్కరరావు ఉన్నారు.

– సీతంపేట

క్రీడా మైదానాల నిర్మాణం పూర్తి చేయాలి



మోడల్ స్కూల్ క్రీడా మైదానం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పీఎంసీ చైర్మన్

భామిని: వేసవి సెలవులు ప్రారంభం కావడానికి ముందే క్రీడా మైదానాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఏపీ మోడల్ స్కూల్ పీఎంసీ చైర్మన్ పి.రవికుమార్, పీఈటీ శివరాంప్రసాద్ అన్నారు. భామిని ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న క్రీడా మైదానాలను మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రహరీలను అనుకొని ఉన్న తోగుల పూడ్చివేత పనులు పూర్తయిన విషయాన్ని గుర్తించారు. ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్‌తో నిర్మాణ పనులపై సమీక్షించారు.

జీడిమామిడిలో పిందె దశ కీలకం



రైతులకు సూచనలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారిణి అమరేశ్వరి

వీరఘట్టం: జీడిమామిడి పంటకు పూత దశ తర్వాత వచ్చే పిందె దశ కూడా ఎంతో కీలకమని ఉద్యానవన శాఖ అధికారిణి అమరేశ్వరి అన్నారు. వండువ గ్రామంలో జీడిమామిడి సాగుచేస్తున్న రైతులకు సస్యరక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. పిందె దశ నుంచి కాయదశకు వచ్చేటప్పుడు చీడపీడలు సోకకుండా ఏయే మందులు పిచికారీ చేయాలో వివరించారు.

వేలం పాటలో పంచాయతీకి రూ.6.55 లక్షల ఆదాయం



వేలం పాటలో సూచనలిస్తున్న డీఎల్‌పీఓ

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీకి చెందిన షాపులను అద్దెకు ఇచ్చేందుకు మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలంలో పంచాయతీకి రూ.6.55 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ బి.కోటీశ్వరరావు తెలిపారు. గ్రామస్తుల సమక్షంలో నిర్వహించిన ఈ వేలంలో అధిక సంఖ్యలో వ్యాపారులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న 4 షాపులను, అంబేడ్కర్ జంక్షన్‌లో ఉన్న ఒక షాపుతో కలిపి మొత్తం ఐదు షాపులకు వేలంలో పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ షాపులకు మరికొద్ది రోజుల్లో వేలం పాట నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. పాటలో డీఎల్‌పీఓ జె.రమాప్రసాదరావు, ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఈఓపీఆర్‌డీ రమణమూర్తి పాల్గొన్నారు. పాటలో పంచాయతీ పాలక వర్గం సభ్యులు పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది.

సారా రహిత గ్రామాలే లక్ష్యం



సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఎక్సైజ్ అధికారి జీవన్‌కిశోర్

గుమ్మలక్ష్మీపురం: సారా రహిత గ్రామాలే లక్ష్యంగా కృషి చేస్తున్నామని పార్వతీపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.జీవన్‌కిశోర్ తెలిపారు. మండలంలోని ఎస్‌కే పాడు గ్రామంలో సారా నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, గ్రామగ్రామానికి వెళ్లి సారా తయారు చేయవద్దు.. తరలించొద్దు.. తాగొద్దు అని చెబుతున్నామన్నారు. అనంతరం సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు. సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని, అలా సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, విజయనగరం నెప్ట్ ఎస్ఐ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.